క్లుప్తంగా

రేపు అవగాహన సదస్సు

కల్లూరు: వయోవృద్ధుల సంరక్షణ చట్టం, సెల్ ఫోన్ లావాదేవీల విషయంలో అప్రమత్తత, నేత్ర, అవయవ దానంపై అవగాహన కల్పించేందుకు స్థానిక శ్రీ సాయిరామ ధ్యాన మందిరంలో గురువారం ఉదయం 10 గంటలకు సదస్సు ఏర్పాటుచేశారు. స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు, రిటైర్డ్ ఎంపీడీఓ మాధవరపు నాగేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు.

విద్యార్థులను అభినందించిన జడ్జి



విద్యార్థులను అభినందిస్తున్న న్యాయమూర్తి ధీరజ్‌కుమార్

మధిర: గత ఏడాది నవంబర్‌లో జాతీయస్థాయిలో నిర్వహించిన నాలెడ్జ్ అసెస్‌మెంట్ టెస్ట్ (క్యాట్) రెండో దశలో స్థానిక శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈమేరకు విద్యార్థులను మంగళవారం మధిర కోర్టు న్యాయమూర్తి డి.ధీరజ్ కుమార్ అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఆకెళ్ల భారతి, డీన్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జీవాలకు నట్టల నివారణ మందు

ముదిగొండ: మండల వ్యాప్తంగా బుధవారం నుంచి గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందు పంపిణీ చేయనున్నట్లు మండల పశువైద్యాధికారి అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం 22న ముదిగొండ, వెంకటాపురం, వనం వారి కిష్టాపురం, ముత్తారం, 23న గోకినేపల్లి, బాణాపురం, 24న మేడేపల్లి, వల్లభి, మల్లారం , 25న యడవల్లి, న్యూలక్ష్మీపురం, పమ్మి, 26న కట్టకూరు, గంధసిరి, అమ్మపేట, 27న మాధాపురం, వల్లాపురం, కమలాపురం, 28న సువర్ణాపురం, మల్లన్నపాలెం, మార్చి 1న న్యూలక్ష్మీపురం, చిరుమర్రి, 2న పండ్రేగుపల్లి, పెద్దమండవ గ్రామాల్లో మందు పంపిణీ ఉంటుందని పేర్కొన్నారు. ఈమేరకు రైతులు తమ జీవాలకు మందు తాగించాలని సూచించారు.

అంకమ్మ మాలధారుల పూజలు

ముదిగొండ: మండలంలోని కమలాపురంలో శ్రీఅంకమ్మ, మద్దిరావమ్మ, మహాలక్ష్మి, పెద్దమ్మ తల్లి విగ్రహాల పునఃప్రతిష్ఠాపన సందర్భంగా మంగవారం పలువురు భక్తులు శ్రీఅంకమ్మ తల్లి మాల ధరించి ఈ సందర్భంగా పూజారి బొర్రా వాసుదేవాచార్యులు ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ వల్లూరి వరలక్ష్మి, ఎంపీటీసీ ఆదినారాణరెడ్డితో పాటు వల్లూరి భద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలల రక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న సీడీపీఓ దయామణి

ఏన్కూరు: బాలల రక్షణను అందరూ బాధ్యతగా భావించాలని ఐసీడీఎస్ సీడీపీఓ దయామణి సూచించారు. స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం నిర్వహించిన బాలల రక్షణ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. భ్రూణ హత్యలు, బాల్యవివాహాలు, లైంగిక వేధింపులు, అక్రమ దత్తత జరగకుండా పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిర్రా రుక్మిణి, ఎంపీటీసీ చీరాల కృష్ణవేణి, ప్రధానోపాధ్యాయురాలు ఏ.శైల పాల్గొన్నారు.

సహకార సంఘాలు ఏర్పాటు చేసుకోవాలి

ఏన్కూరు: మండలంలోని గిరిజనులు మత్స్య సహకార సంఘాలు ఏర్పాటు చేసుకోవాలని వైరా మత్స్యశాఖాధికారి బి.బుజ్జిబాబు సూచించారు. ఈమేరకు ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించాలని ఆయన కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశమైన ఆయన పలు సూచనలు చేశారు.ఎంపీడీఓ బయ్యారపు అశోక్, సూపరింటెండెంట్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కల్లూరు రూరల్: కల్లూరు మండలం పుల్లయ్య బంజరు గ్రామ పంచాయతీలో మంగళవారం వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎంపీపీ బీరవెల్లి రఘు, జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, సర్పంచ్ పెద్దబోయిన కృష్ణవేణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి శ్రీకాంత్ బీపీ, షుగర్ పేషంట్లకు వైద్య పరీక్షలు చేసి ప్రభుత్వం అందించిన మందులను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహకార బ్యాంక్ డైరెక్టర్ బోబోలు లక్ష్మణరావు, ఎంపీటీసీ, సీహెచ్ఓ రేవతి, ఏఎన్ఎంలు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్నాలు, రాస్తారోకోలు..

రుణమాఫీ అమలు చేయాలి..



కుర్నవల్లి బ్యాంక్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

తల్లాడ: కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.లక్ష రుణమాఫీని ఒకేసారి అమలు చేయాలని మంగళవారం కుర్నవల్లి ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ వద్ద మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకుడు తాతా భాస్కర్ రావు మాట్లాడుతూ.. రుణ మాఫీలో జాప్యం జరగడంతో రైతులకు అదనపు వడ్డీ భారం పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు శీలం సత్యనారాయణరెడ్డి, శీలం ఫకీరమ్మ, అయినాల రామలింగేశ్వరరావు, ఐలూరి వెంకటకోటారెడ్డి, చలపతిరెడ్డి, ఎక్కిరాల పుల్లయ్య, సూరంపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు న్యాయం చేయాలి..



రాస్తారోకోలో పాల్గొన్న నాయకులు, స్థానికులు

కల్లూరు: కల్లూరులో డబుల్ బెడ్‌రూం ఇళ్ల ఎంపిక సందర్భంగా అర్హులకు న్యాయం జరగనందున పునఃపరిశీలన చేయాలని టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటూరి మానవతారాయ్ డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానికులతో కలిసి మంగళవారం ఆయన రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మానవతారాయ్ మాట్లాడుతూ ముందుగా చీటీలు రాసుకొచ్చి లాటరీ తీయడంతో అనుమానాలు వస్తున్నాయని చెప్పారు. ఇకనైనా అధికారులు విచారణ చేపట్టి అర్హులకే డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈవిషయమై బుధవారం నుంచి ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట రిలే దీక్షలు చేపట్టనున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ లక్కిరెడ్డి గోపిరెడ్డితో పాటు దామాల రాజు, భూక్యా శివకుమార్, కర్నాటి వెంకటరెడ్డి, పాశం నాగేశ్వరరావు, షేక్ బాజి తదితరులు పాల్గొన్నారు. కాగా, కల్లూరు మండలం చంద్రుపట్లలో పలువురి కుటుంబాలను మానవతారాయ్ పరామర్శించారు. నాయకులు దామాల రాజు, భూక్యా శివకుమార్ నాయక్, కర్నాటి వెంకటరెడ్డి, బాబురావు, బాజి, జానీపాషా, కృష్ణ, బాబురావు పాల్గొన్నారు.

రాతోని లిఫ్టు నీటిని తూర్పు పొలాలకు విడుదల చేయాలి..



ధర్నా చేస్తున్న తూర్పు ప్రాంత రైతులు

పెనుబల్లి : పెనుబల్లి రాతోని ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటిని తూర్పు ప్రాంత పొలాలకు విడుదల చేయాలని ఆ ప్రాంత రైతులు మంగళవారం వియంబంజర్ జల వనరుల శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తమ పొలాలకు పది రోజులకు పైగా నీరు అందక పంట పొలాలు ఎండిపోతున్నాయని, అధికారులు తమ పొలాలను పరిశీలించి సరిపడా నీటిని విడుదల చేయాలని కోరారు.

ఎస్‌బీఐ ఎదుట రైతుల ధర్నా..



ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు

వైరా: గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మేరకు రైతులకు రూ.లక్ష రుణమాఫీని వెంటనే అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వైరాలోని ఎస్‌బీఐ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ.. నాలుగున్నరేళ్లుగా హామీని నెరవేర్చకపోవడంతో రైతులపై వడ్డీ భారం పడుతున్నందున వెంటనే రుణాలు మాఫీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లెంపాటి రామారావు, వనమా చిన సత్యనారాయణ, చింతనిప్పు చలపతిరావు, శరాబందీ, చెరుకుమల్లి కుటుంబరావు, సాంబశివరావు, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, రమణ అనుమోలు రామారావు, తూము సుధాకర్, జయరాజ్, నర్సింహారావు పాల్గొన్నారు.

ఆటో స్టార్టర్లు తొలగించొద్దు..



వేంసూరు: ఏఈకి వినతి పత్రం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేంసూరు/ఎర్రుపాలెం: రైతులు తమ పంట పొలాల్లో విద్యుత్ మోటార్లకు అమర్చిన ఆటో స్టార్టర్లను తొలగించొద్దని వేంసూరులక్ష కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం రాయుడుపాలెం ఏఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఏఈ అనిల్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. అదే విధంగా ఎర్రుపాలెం మండలంలో విద్యుత్ మోటార్లకు అమర్చిన ఆటో స్టార్టర్లను తొలగిస్తున్న లైన్‌మెన్ షేక్ అఖిల్‌ను రాజుపాలెం, నారాయణపురం గ్రామాల రైతులు, ఎర్రుపాలెం సర్పంచ్ బూసిపల్లి వెంకటరెడ్డి, ఎంపీటీసీ దోమందుల సామేలు మంగళవారం అడ్డుకున్నారు. అనంతరం స్థానిక విద్యుత్ ఏఈ శ్రీనివాసరావును అడుగగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొలగిస్తున్నట్లు చెప్పి ఒకసారి రైతులను కలవమన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా నాయకుడు పుచ్చాకాయల సోమిరెడ్డి మాట్లాడుతూ.. గంటకోకసారి పోయి వచ్చే విద్యుత్‌కు ఆటో స్టార్టర్లు లేకపోతే రైతులు నిత్యం పొలాల వద్దే కాపల కాయాల్సి వస్తుందన్నారు. తొలగించే ప్రక్రియను విరమించుకోకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు పుచ్చాకాయల సోమిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కాసరి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ మండపాటి రాఘవరెడ్డి, రావుల పుల్లారావు, నాయకులు తుమ్మురు లక్ష్మారెడ్డి, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై వినతి



ఎంపీ, ఎమ్మెల్యేతో బీఆర్ఎస్ నాయకులు

కొణిజర్ల: మండలంలో రహదారులతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు కోరారు. ఈమేరకు ఎంపీ నామా నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్‌ను మంగళవారం ఖమ్మంలో కలిసి వినతిపత్రం అందజేయగా వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో నాయకులు దొడ్డపనేని రామారావు, తాళ్లూరి చిన్న పుల్లయ్య, ఏలూరి శ్రీనివాసరావు, బండారు కృష్ణ, బూర ప్రసాద్, రోషన్ బేగ్, రంగు సత్యనారాయణ, చిరంజీవి, సురేష్, బాబూలాల్, రంగా, జీడయ్య, దేవేందర్, మదన్ పాల్గొన్నారు.

మధిరలో పర్యటించిన ఎంపీ నామా..

మధిర: మండలంలో ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా పలు కుటుంబాలను పరామర్శించారు. ఇటీవల అమెరికాలో గన్ మిస్ ఫైర్ ఘటనలో మృతిచెందిన మహంకాళి అఖిల్ శ్రావిక్(సాయి) కుటుంబాన్ని ఆయన ఓదార్చారు. మృతుడి కుటుంబ సభ్యులకు అండగా ఉండానని చెప్పారు. అదేవిధంగా మహదేవపురం, చిలుకూరు,నిదానపురం, మాటూరుపేట, మాటూరు గ్రామాల్లో పలు కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ తదితరులు ఉన్నారు.

బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్



గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తున్న బంజారాలు

ఏన్కూరు: బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ అని టీపీసీసీ సభ్యుడు రామ్మూర్తినాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఎర్రబోడుతండలో సంత్ సేవాలాల్ జయంతి వేడుకలలో భాగంగా భోగ్ బండారో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామదేవతలకు, సంత్ సేవాలాల్‌కు ప్రత్యేక పూజలు చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాళోతు నర్సింహారావు, భూక్య బాబులాల్, రాజేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

దోపిడీకి పాల్పడుతున్న కేంద్రం



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

కారేపల్లి: మోదీ ప్రభుత్వం కార్పొరేట్ దోపిడీకి పాల్పడుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం కారేపల్లిలోని బాగం రామనర్సయ్య భవన్‌లో కార్మిక కర్షక సదస్సులో ఆయన మాట్లాడారు. ఆదానీ కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ఇచ్చిన హామీలను విస్మరించారన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రమేష్, భూక్యా వీరభద్రం, మెరుగు సత్యనారాయణ, జిల్లా నాయకులు కొండబోయిన నాగేశ్వరరావుతో పాటు తలారి దేవప్రకాశ్, కె.నరేందర్, సర్పంచ్ ఇందిరాజ్యోతి, కొండయ్య, రాధ పాల్గొన్నారు.

దొరల పాలనను పారదోలుదాం



మాట్లాడుతున్న కనకాల వెంకట్రామయ్య

తల్లాడ: రాష్ట్రంలో దొరల పాలనను పారదోలుదామని బీజేపీ రాష్ట్ర నాయకుడు కనకాల వెంకట్రామయ్య అన్నారు. మంగళవారం మండలంలోని బిల్లుపాడు జగన్నాథపురం కాలనీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.
ప్రాజెక్టులు పేరుతో రూ.వేల కోట్లు దండుకుంటూ ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని తెలిపారు. తెలంగాణలో బీజేపీకి ప్రజాదరణ పెరుగుతున్నందున రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆపతి వెంకటరామారావు, గాదె కృష్ణారావు, వేముల వెంకటనారాయణ, రాయల రమేష్, తొండపు మధు పాల్గొన్నారు.

1 నుంచి కార్మిక, కర్షక పాదయాత్రలు

వైరా: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా మార్చి 1 నుంచి 7వ తేదీ వరకు కార్మిక, కర్షక గ్రామ పాదయాత్రలు నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు తెలిపారు. వైరాలో మంగళవారం చింతనిప్పు చలపతిరావు, గుమ్మా నరసింహారావు, బాజోజు రమణ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో వారు మాట్లాడారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేయడాన్ని ఉపసంహరించుకోవడంతో పాటు ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని, లేబర్ కోడ్లు రద్దు చేయాలనే డిమాండ్‌తో ఈ పాదయాత్ర చేపడుతున్నామని తెలిపారు. అలాగే, ఏప్రిల్ 5న ఛలో ఢిల్లీ నిర్వహించనున్నామని చెప్పారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, నాయకులువనమా చిన సత్యనారాయణ, చెరుకుమల్లి కుటుంబరావు, తూము సుధాకర్, మోదుగు వెంకటేశ్వరరావు, రామారావు, సుధాకర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

తల్లాడ: స్థానిక హనుమత్ పద్మావతి వేంకటేశ్వర ఆలయ 20వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం శ్రీవేంకటనారాయణ అష్టాక్షరీ మహా యజ్ఞం వైభవంగా జరిగింది. శ్రీనివాస స్వామి, అమ్మవార్లతో పాటు ఆంజనేయ స్వామి వారికి తులాభార కార్యక్రమం నిర్వహించారు. అనంతరం హారతి, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. శ్రీనివాసమూర్తికి ఎదుర్కోలు ఉత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు దీవీ సీతారామాచార్యులు, రొంపిచర్ల వెంకటసత్యనారాయణచార్యులు, వికనసాచార్యులు, బాలకృష్ణమాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గాయాలు

బోనకల్: మండలంలోని ఆళ్లపాడుకు చెందిన గీత కార్మికుడు అనబోతుల వీరబాబు ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి పడడంతో గాయాలయ్యాయి. రోజులాగే కల్లు తీసేందుకు మంగళవారం చెట్టు ఎక్కిన ఆయన జారి పడగా గాయాలు కావడంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చింతకాని: మండలంలోని చిన్నమండవ మున్నేరు నుంచి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల సందర్భంగా ఎలాంటి అనుమతి పత్రాలు లేవని తేలడంతో ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.వెంకన్న తెలిపారు.

అభివృద్ధి పనులకు రూ.54 కోట్లు మంజూరు



నారాయణపురంలో కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి: మండలంలోని నారాయణపురంలో మంగళవారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సత్తుపల్లి నియోజకవర్గానికి సీఎం కేసీఆర్ డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ.54 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులను ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి వినియోగించనున్నట్లు చెప్పారు. అంతేకాక రామానగరంలో విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన కొండ ప్రదీప్ కుటుంబానికి రూ.2 లక్షలు బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ పరిహారం అందించారు. రామానగరం, రామగోవిందాపురం, బేతుపల్లి, నారాయణపురం, కాకర్లపల్లి, రుద్రాక్షపల్లి, రేగళ్లపాడు, చంద్రాయపాలెం, బుగ్గపాడు గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఆత్మచైర్మన్ శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, ఎంపీపీ దొడ్డా హైమావతి, శంకర్‌రావు, సర్పంచ్‌లు రంగారెడ్డి, రమాదేవి, కళావతి, శ్రీనివాసరావు, విజయ, జయేందర్, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, సత్యనారాయణ, యాగంటి శ్రీనివాసరావు, ఎస్‌కె ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే..



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వైరా: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడం ఖాయమని టీపీసీసీ సభ్యుడు ధరావత్ రామ్మూర్తి, కార్యదర్శి కట్ల రంగారావు ధీమా వ్యక్తం చేశారు. వైరా మున్సిపాలిటీ పరిధి సోమవరం గ్రామంలో మంగళవారం హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించగా వారు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ కార్యకర్తలు అకుంఠిత దీక్షతో పనిచేసి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా కాంగ్రెస్ డిక్లరేషన్ కరపత్రాలను పంపిణీ చేయడంతో పాటు పలు కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు కట్ల సంతోష్, సండ్రు గోపి, ఇండ్ల నాగరాజు, కొలకాని లక్ష్మయ్య, పుల్లయ్య , రాములు, వెంకటి, బాబు, సాయి, రాజేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై అప్రమత్తత అవసరం



సదస్సును ప్రారంభిస్తున్న సీడీపీఓ కొండమ్మ

సత్తుపల్లిటౌన్: మావన అక్రమ రవాణాపై ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉందని ఐసీడీఎస్ సీడీపీఓ ఎ.కొండమ్మ తెలిపారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన సత్తుపల్లిలో అంగన్‌వాడీ టీచర్లకు ఏర్పాటుచేసిన రెండురోజుల అవగాహన సదస్సు మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా కొండమ్మ మాట్లాడుతూ.. ఎవరూ తప్పుడు మార్గంలో వెళ్లకుండా అవగాహన కల్పించాలన్నారు. సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మి, మల్లీశ్వరి, మహాలక్ష్మి, భవాని, రమాదేవి, రజిని, సుజాత, కమల, ప్రజ్వల సంస్థ కోఆర్డినేటర్ సురేష్‌కుమార్, శ్రావ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ జాబితాలో వేరే కులాలను చేర్చొద్దు

పెనుబల్లి : ఎస్టీ జాబితాలో కొత్తగా చేర్చిన 11 కులాలను వెంటనే తొలగించాలని లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ధర్మసోతు దశరథ్‌నాయక్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పెనుబల్లిలో నిర్వహించిన ఆ సంఘ కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి గుగులోతు కృష్ణనాయక్‌తో కలిసి ఆయన మాట్లాడారు. వేరే కులాల తొలగింపుతో పాటు గిరిజన బంధు అమలు చేయాలని, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, మైదాన ప్రాంతంలో ఐటీడీఏలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇస్లావత్ రాంబాబు, బాణోతు రాము నాయక్, ప్రసాద్ నాయక్, నాగేశ్వరరావు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

లాజిస్టిక్స్ కౌంటర్ ప్రారంభం

పెనుబల్లి: మండల పరిధిలోని వియంబంజర్ ఆర్టీసీ బస్టాండ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన లాజిస్టిక్స్ కౌంటర్‌ను టీఎస్‌ఆర్టీసీ లాజిస్టిక్స్ డిప్యూటీ సీటీఎం కె. భానుకిరణ్ సత్తుపల్లి డిపో మేనేజర్ రాజ్యలక్ష్మితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా తక్కువ ఖర్చుతో వేగంగా సరుకు రవాణా చేయబడుతుందని తెలిపారు. ఈ సేవలకు సంబంధించిన కరపత్రాలను ఆర్టీసీ సిబ్బంది పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.వేణుగోపాల్, హరి వర్మ, మునీర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

హోమియోపతిలో విద్యార్థినికి సీటు

తల్లాడ: మండల పరిధిలోని నారాయణపురం గ్రామం దళిత కాలనీకి చెందిన సంగసాని ప్రియాంక హైదరాబాద్ జై సూర్య పొట్టి శ్రీరాములు ప్రభుత్వ మెడికల్ కళాశాల రామంతాపూర్‌లో ఫ్రీ సీటు సాధించింది.ఈమె 2022-23 సంవత్సరంలో హోమియోపతిలో బీహెచ్ఎంఎస్‌లో ర్యాంక్ సాధించి సీటు లభించింది. ఈమేరకు మంగళవారం పలువురు ప్రజాప్రతినిధులు ప్రియాంకను అభినందించారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం

బోనకల్: మండలంలోని చిరునోముల ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి రిటైర్ ఉపాధ్యాయురాలు చావా చిట్టెమ్మ మంగళవారం రూ.10 వేలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధి కోసం తనవంతు సాయమందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ములకారపు రవి, ఉప సర్పంచ్ పుల్లారావు, ఎస్ఎంసీ చైర్మన్ రాము, హెచ్ఎంలు శ్రీనివాసరావు, చంద్రప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

ముదిగొండ: మండల పరిధిలోని గంధసిరిలో మంగళవారం రాత్రి సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క సతీమణి, అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ సమక్షంలో బీఆర్ఎస్ నుంచి 25 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలోకి చేరి కండువాలు కప్పుకున్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు బుల్లెట్‌బాబు, పసుపులేటి దేవేంద్రం, వల్లబి ఎంపీటీసీ బిచ్చాల భిక్షం, నాయకులు కృష్ణ, రామారావు, గోవిందరావు, రవి పాల్గొన్నారు.

సీఐ, ఎస్సైలకు సన్మానం



సన్మానిస్తున్న జాతర కమిటీ సభ్యులు


వైరారూరల్: మండలంలోని స్నానాల లక్ష్మీపురంలో శివరాత్రి జాతర ముగింపు సందర్భంగా సోమవారం రాత్రి సీఐ తాటిపాముల సురేష్, ఎస్సై శాఖమూరి వీరప్రసాద్‌లను జాతర కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. జాతరలో పటిష్ట బందోబస్తు నిర్వహించినందుకు గానూ సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అమ్మిక రామారావు, ఉపసర్పంచ్ మల్లు రామకృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ చింతనిప్పు రాంబాబు, ఈఓ శ్రీనివాస్, ధర్మకర్త మండలి సభ్యులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను వినియోగించుకోండి

ఏన్కూరు/ముదిగొండ/తల్లాడ: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఏన్కూరు జెడ్పీటీసీ బాదావత్ బుజ్జి, ముదిగొండ ఎంపీపీ సామినేని హరిప్రసాద్ , తల్లాడ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు సూచించారు. ఏన్కూరు, ముదిగొండ మండలం సువర్ణాపురం, తల్లాడ మండలం నూతనకల్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన కంటి వెలుగు శిబిరాలను వారు ప్రారంభించి మాట్లాడారు. ఉచితంగా కంటి పరీక్షలు చేయడమే కాక అవసరమైన వారికి అద్దాలు ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్‌లు చిర్రా రుక్మిణి, కొట్టె అపర్ణ,తూము శ్రీనివాసరెడ్డి, ముదిగొండ జెడ్పీటీసీ దుర్గ, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ సూర్యనారాయణతోపాటు ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులు చీరాల కృష్ణవేణి, వేముల రమేష్, రాములు, గోపి, తోట ధర్మ, అరుణాదేవి, బుర్ర హరీష్, రత్న మనోహర్, నాయుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం..

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాతృభాష కవులను స్మరించుకుంటూ.. మాతృభాషకు సేవ చేసిన కవులు, రచయితల చిత్రపటాలను విద్యార్థులు ప్రదర్శించారు. అనంతరం మాతృభాష ఆవశ్యకతపై వ్యాసరచన పోటీలు, నృత్య పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. – సాక్షి నెట్‌వర్క్



వైరారూరల్: గన్నవరం జెడ్పీహెచ్ఎస్‌లో కవుల చిత్రపటాలను ప్రదర్శిస్తున్న చిన్నారులు